క్లుప్తంగా

యువతి వివాహానికి ఆర్థికసాయం



చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

పెగడపల్లి: మండలంలోని నంచర్ల గ్రామానికి చెందిన సమత వివాహానికి ఆర్థికసాయం అందించి శ్రీరామ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. సమత తండ్రి మల్లయ్య చిన్నతనంలోనే మృతిచెందగా తల్లి భూలక్ష్మి పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేస్తోంది. కూతురి వివాహం నిశ్చయం కావడంతో శ్రీ రామట్రస్ట్‌ను ఆశ్రయించారు. ట్రస్టు సభ్యులు చొరవ తీసుకొని దాతల నుంచి రూ.46 వేలు సేకరించారు. కాగా శనివారం ట్రస్టు సభ్యులు భూలక్ష్మికి చెక్కు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాస్, మేనేజింగ్ డైరెక్టర్ మల్లేశం గౌడ్, కమలశ్రీ. సంతోష్‌గౌడ్, సత్యనారాయణ, విటల్, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న బీఎల్‌వోలు

ఇబ్రహీంపట్నం : మండలంలో పనిచేస్తున్న బీఎల్‌వోలకు వెంటనే డబ్బులు చెల్లించాలని కోరుతూ శనివారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆర్‌ఐ గంగాధర్‌కు బీఎల్‌వోలు వినతిపత్రం అందచేశారు. జూన్‌లో పనిచేసిన కొందరికి మాత్రమే డబ్బులు చెల్లించారని, మిగతావారికి రూ.8 వేల వరకు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. బీఎల్‌వోలు సమీసుల్తానా, గంగమణి, రమదేవి, ఇందిరా, గిరిజ, జాలిగమ, విజయలక్ష్మి, , పద్మ, రాజ్యలక్ష్మి, రాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు



ఇబ్రహీంపట్నం : భారత క్రికెట్ ఆటగాళ్లు ప్రపంచకప్ గెలవాలని కోరుతూ శనివారం మండలంలోని వేములకుర్తి గ్రామంలో శ్రీ సీతారామ లక్ష్మణస్వామి ఆలయంలో వేములకుర్తి క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఆరె నరేందర్, అసోసియేషన్ సభ్యులు పెంట మహేశ్, బర్మ నాగేశ్, పట్నం నవీన్, అన్నరపు రాకేశ్, ఆరె సురేందర్, అన్నరాపు శ్రీకాంత్, శేశి రంజిత్, అర్చకులు మంత్రరాజం జానకీ రామకృష్ణచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లర్ల దోపిడీని కట్టడి చేస్తాం



లక్ష్మీదేవిపల్లిలో ప్రచారం చేస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్/జగిత్యాలటౌన్/జగిత్యాలరూరల్/రాయికల్: కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైస్‌మిల్లర్ల దోపిడీని కట్టడి చేస్తామని అని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. శనివారం సారంగాపూర్ మండలం రేచపల్లి, లక్ష్మీదేవిపల్లిలో ప్రచారం నిర్వహించారు. గొల్ల కురుమలు గొర్రెల కొనుగోలుకు ఖాతాల్లో నేరుగా రూ.2 లక్షలు జమ చేస్తామన్నారు. సర్పంచ్ లక్ష్మీ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

బీర్‌పూర్ మండలానికి చెందిన టీడీపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన దాదాపు 200మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరగా జీవన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. సత్యనారాయణ, గురునాథం రాజన్న, రాజేందర్, లచ్చన్న, రాజన్న, వెంకటి ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే రైతాంగానికి ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌పార్టీదేనన్నారు. రాయికల్ మండలం రామాజీపేటలో జీవన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కోడలు చరిష్మరెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు.

నెక్లెస్ బహూకరణ



కోరుట్ల: పట్టణంలోని త్రిశక్తి మాతా అమ్మవారికి నిజామాబాద్‌కు చెందిన శ్రీరాం బాల్‌కిషన్, లత దంపతులు 10 గ్రాముల బంగారు నెక్లెస్‌ను బహూకరించారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారు అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కటుకం గణేశ్ పాల్గొన్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

- వాహనదారులు ఇబ్బంది
- తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు



అమ్మక్కపేట శివారులో గుంతలమయంగా రోడ్డు

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రం నుంచి అమ్మక్కపేట ద్వారా మెట్‌పల్లికి వెళ్లే ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు, మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్, గోదూర్ నుంచి బట్టాపూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం నుంచి రోజూ మెట్‌పల్లి వైపు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆరేళ్ల క్రితం అమ్మక్కపేట శివారులోని టాటాస్ట్రైవ్ శిక్షణ కేంద్రం మూలమలుపు వద్ద డబ్బా వాటర్ గ్రిడ్ మెయిన్ పైపులైన్ వేసేందుకు రోడ్డును తవ్వి పైపులైన్లు వేశారు. అప్పటి నుంచి గుంతను పూడ్చి బీటీతో ప్యాచ్‌వర్క్ చేయకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగేళ్ల క్రితం ఇదే గుంతవద్ద మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు బైక్‌పై నుంచి అదుపుతప్పి పడిపోవడంతో మృతిచెందాడు. రాత్రి సమయంలో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇబ్రహీంపట్నం నుంచి అమ్మక్కపేట వేళ్లే రోడ్డులో టాటాస్ట్రైవ్ మూలమలుపు వద్ద గుంతను బీటీతో ప్యాచ్ చేయాలని కోరుతున్నా భగీరథ అధికారులే పైప్‌లైన్ కోసం గుంతను తవ్వారని, వారే గుంతను బీటీతో ప్యాచ్ వర్క్ చేయాలని ఆర్ అండ్‌బీ అధికారులు చెబుతున్నారు. దీంతో వాహనదారులు ప్రయాణం సాగించాలంటే అవస్థలు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం శివారులో మిచ్చమ్మ ఆశ్రమం వద్ద రెండేళ్ల క్రితం పైపులు వేసేందుకు కాంట్రాక్టర్ రోడ్డును తవ్వి పైపులు వేయగా గుంతను పూడ్చి బీటీతో ప్యాచ్ చేయాల్సి ఉంది. సంబంధిత కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడంతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్, గోదూర్ నుంచి బట్టాపూర్ రోడ్లపై గుంతలను అధికారులు పూడ్చివేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మెట్‌పల్లి వైపు, మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్, గోదూర్ నుంచి బట్టాపూర్ రోడ్లపై వెళ్లే వాహనదారులు గుంతలరోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వాహనాలు అదుపుతప్పి తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు వెంటనే స్పందించి గుంతలు పూడ్చాలి.

– కొడిమ్యాల దీపక్‌రాజ్, ఇబ్రహీంపట్నం

ప్రతిపాదనలు పంపాం



మెట్‌పల్లి నుంచి మూలరాంపూర్, గోదూర్ నుంచి బట్టాపూర్ రోడ్లను రెన్యువల్ బీటీగా చేసేందుకు రూ.2 కోట్లతో అంచనాతో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. మండలకేంద్రం నుంచి అమ్మక్కపేట ద్వారా మెట్‌పల్లికి వెళ్లే దారిలోని ప్రమాదకర గుంతలు పూడ్చుతాం.

– వేణు, అర్‌అండ్‌బీ, ఏఈ

ప్రతీ ఇంటికి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలు



ఎర్రాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న మాజీ కౌన్సిలర్ సోగ్రాబీ

- కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి సంజయ్ తరఫున ప్రచారం

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాయని, రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు చేపడుతామని కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని ఎర్రాపూర్, ఎర్రాపూర్ తండాలో ఎమ్మెల్యే అభ్యర్థి, ఆయన కుమారుడు సంజయ్ తరఫున ప్రచారం చేశారు. రాష్ట్రం పదేళ్ల క్రితం ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉందో ప్రజలు గమనించాలని కోరారు. రానున్న రోజుల్లో తెల్లరేషన్ కార్డుదారులకు అన్నపూర్ణ పథకం ద్వారా సన్నబియ్యం ఇస్తామన్నారు. ఎర్రాపూర్‌కు బస్సు సౌకర్యం లేదని, మిషన్ భగీరథ నీళ్ల రావడం లేదని గ్రామస్తులు ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన ఆయన మెట్‌పల్లి ఆర్టీసీ డిపో మేనేజర్‌కు ఫోన్ చేసి గ్రామస్తులతో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించాలని సూచించారు. భగీరథ ఏఈకి ఫోన్ చేసి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మొద్దని కాంగ్రెస్ అధికారంలోకొస్తే వ్యవసాయానికి మూడు గంటలే కరెంట్ ఇస్తుందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని కొజన్‌కొత్తూర్, కేశాపూర్, ఎర్దండి, మూలరాంపూర్, బర్ధీపూర్‌లో ప్రచారం చేశారు. స్థానికంగా ఉంటూ ప్రజలకు అందుబాటులో ఉండే తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఎంపీపీ జాజాల భీమేశ్వరి, సర్పంచు శాంత, ఎంపీటీసీ సరోజ, నాయకులు కమటం రమేశ్, జాజాల జగన్‌రావు, జేడీ.సుమన్, ఏలేటి చిన్నారెడ్డి, సుగుణాకర్‌రావు, ద్యావతి సుదర్శన్, ఎలాల దశరథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ గెలిస్తే మరింత అభివృద్ధి:జెడ్పీటీసీ లావణ్య

కోరుట్ల రూరల్: కోరుట్ల ఎమ్మెల్యేగా సంజయ్ గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని జడ్పీటీసీ దారిశెట్టి లావణ్య అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

సంజయ్‌ను భారీ మెజారిటీతో గెలిపించండి

కోరుట్ల: తన భర్తను భారీ మెజారిటీతో గెలిపించాలని సంజయ్ సతీమణి దీప్తి అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ ఆడెపు కమల, నాయకులు గంద్ర శిల్పారావు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ కౌన్సిలర్ సోగ్రాబీ, ఆమె కుమారుడు కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఏఆర్.అక్బర్ 200 మందితో శనివారం రాత్రి ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి వైఖరి నచ్చకనే పార్టీని వీడుతున్నట్లు ప్రకటించారు. కన్నతల్లి వంటి కాంగ్రెస్‌ను వీడటం ఇబ్బందిగా ఉన్నా.. నాయకుల తీరు సరిగాలేకనే నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సంజయ్ గెలుపు కోసం తాను శాయశక్తులా పనిచేస్తానన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్, మైనార్టీ వి భాగం అధ్యక్షులు ఫయీం, నాయకులు లక్ష్మీనారాయణ, సురేశ్, సత్యం, సజ్జు, రహీం, బాబా, సే నాపతి రాజు, గోనెపల్లి శేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- కాంగ్రెస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



వేములవాడఅర్బన్: మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. చింతాల్‌ఠాణా, గుర్రవానిపల్లి, చీర్లవంచ, చంద్రగిరి గ్రామాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.5.04 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి స్థలం పట్టా ఇచ్చిన ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కింద రూ.5 లక్షలు అందిస్తామన్నారు. మండల అధ్యక్షుడు కనకయ్య, రాజు, శ్రీనివాసరావు, పర్శరాములు, దేవరాజు, కనకయ్య, పర్శరాములు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మా ఆయన్ని గెలిపించండి

వేములవాడ: కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి ఆది వనజ వేములవాడ పట్టణంలోని 25వ వార్డు మార్కండేయనగర్‌లో గడపగడపకూ ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. మా ఆయన్ని గెలిపించాలని, వేములవాడ అభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ మహిళలకు బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థించారు.

కాంగ్రెస్ ప్రచారం

కోనరావుపేట: మరిమడ్ల, నిమ్మపల్లి, మామిడిపల్లి, నిజామాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. పుల్కం మల్లేశం, కుమ్మరి రాజ్‌కుమార్, కొమ్ము బాబు, పర్శరాములు, మహంకాళి శ్రీనివాస్, ఎల్లాల లింగారెడ్డి, ఎల్లాల రాంరెడ్డి, బుర్ర సాయి, మల్లేశం, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ గ్రామానికి చెందిన యువకులు దేవయ్య, పర్శరాములు, తదితరులు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.



కథలాపూర్ : మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కథలాపూర్: వరదకాలువ ద్వారా ఈ ప్రాంతానికి నీరందించిన ఘనత కాంగ్రెస్‌దేనని ఆ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. చింతకుంట, భూషణరావుపేట, పెగ్గెర్ల, ఊట్‌పెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ సులోచన, నాయకులు కాయితి నాగరాజు, బైర మల్లేశం, దేవ్‌యాదవ్, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, నాయకులు గంగాధర్, భూమరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కోరుట్ల రూరల్ : పట్టణంలోని లిటిల్ జీనియస్ పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థిని మధురిమ కరాటే పోటీల్లో ప్రతిభ కనబర్చింది. కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో కటాఫ్ విభాగంలో బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్, ప్రిన్సిపాల్స్ కలకుంట్ల రాధాకృష్ణ, వినోద, రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

బీజేపీకి రాజీనామా

మెట్‌పల్లి: ఎంపీ ధర్మపురి అర్వింద్ కోరుట్ల టికెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి మోసంచేశారని, అలాంటి వ్యక్తి ఉన్న చోట బీజేపీలో పనిచేయడం ఇష్టంలేక రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాంబారి ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ఎంపీ ఎన్నికల్లో తన గెలుపునకు కృషిచేస్తే అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల టికెట్ కేటాయించేలా చూస్తానని అర్వింద్ హామీ ఇవ్వడంతో బీజేపీలో చేరినట్లు తెలిపారు. నియోజకవర్గంలో నిర్వహించిన పద్మశాలీ యుద్ధభేరి విజయవంతం కావడంతో బీజేపీకి మరింత ఆదరణ పెరిగిందన్నారు. కానీ ఎంపీ తన స్వలాభం కోసం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దిగి మోసం చేశారని, ఆయన వైఖరికి నిరసనగా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

బీఆర్‌ఎస్‌లోకి తుల ఉమ వర్గీయులు

మేడిపల్లి: బీజేపీ టికెట్ ఆశించిన భంగపడిన తుల ఉమ తర్వాత జరిగిన పరిణామాలతో బీఆర్‌ఎస్‌లో చేరిన సంగతి తెలిసిందే. శనివారం తుల ఉమ వర్గీయులు బొంగోని రాజా గౌడ్, అంగడీ ఆనంద్, ఇతరులు వేములవాడ బీఆర్‌ఎస్ అభ్యరి చల్మెడ లక్ష్మీ నర్సింహరావు సమక్షంలో పెద్ద ఎత్తున బీఆర్‌ఎస్‌లో చేరారు. మేడిపల్లి , ఒడ్యాడ్, కమ్మరిపేట, గోవిందారం నుంచి కార్యకర్తలు పార్టీలో చేరారు.

ఇంటింటా ప్రచారం

బీమారం మండల కేంద్రంలో గ్రామశాఖ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో చెక్కపెల్లి రఘు, రాజబోస్, పల్లి అర్జున్, స్వామి, ఆరె నర్సయ్య. తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ ఎన్నిక

మెట్‌పల్లి: పట్టణ వెల్డింగ్ వ్యాపారుల సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సల్మాన్‌ఖాన్, గౌరవా అధ్యక్షుడిగా కంబ నాగరాజు, ఉపాధ్యక్షుడిగా మాజిద్, కోశాధికారిగా ముస్తాక్‌ను ఎన్నుకున్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి




పనులు పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల : పట్టణంలోని పలు వార్డుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డ్రైనేజీల క్లీనింగ్‌తో పాటు, చెట్ల పొదల తొలగింపు పనులను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు గజానంద్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్


కథలాపూర్: మండలకేంద్రంలోని రెయిన్ బో పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికలు, ఓటుహక్కుపై అవగాహన కల్పించేందుకు మాక్ పోలింగ్ నిర్వహించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. కరస్పాండెంట్ రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



శిథిలమవుతున్న బురుజు

కోరుట్ల: పట్టణంలోని పురాతన కోట బురుజులు శిథిలమవుతున్నాయి. జైనుల కాలం నాటి చరిత్రకు నిలువుటద్దంగా నిలిచిన మూడు కోట బురుజులు ఉండగా రెండింటికి రంగులు వేయించి బాగు చేయించిన మున్సిపల్ అధికారులు మరో కోట బురుజును బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలతో సృజనాత్మకత పెంపు



ప్రదర్శనలను తిలకిస్తున్న సిస్టర్ జ్యోతిస్

జగిత్యాలటౌన్ : వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని మౌంట్ కార్మెల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ జ్యోతిస్ అన్నారు. శనివారం జగిత్యాల రూరల్ మండలం ధరూర్‌లోని మౌంట్ కార్మెల్ పాఠశాలలో నిర్వహించిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చంద్రయాన్ శ్రీ రాకెట్ నమూనా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అగ్రికల్చర్ ఇన్ ఆక్వాకల్చర్ ప్రయోగం తయారు చేసిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు జస్మిత, అక్షితను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిమారియా ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో ప్రణీత్‌కౌర్, ఫాదర్ జోసెఫ్‌రెడ్డి, సిస్టర్స్, రాజన్న, రాజేందర్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చల్మెడకే మా మద్దతు

- రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్



వేములవాడ: సహచరులతో చాయ్ తాగుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహరావు

వేములవాడ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రజకులు బీఆర్‌ఎస్ పార్టీకే మద్దతు పలుకుతున్నామని రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ అన్నారు. చల్మెడ నివాసంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో శనివారం సమావేశమయ్యారు. అన్ని గ్రామాల్లో రజకులతో మాట్లాడి అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేస్తామన్నారు. రజక సంఘాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య, మండలాల అధ్యక్షులు మొగిలి అంజయ్య, సుద్దాల నర్సయ్య, లింగంపల్లి గంగాధర్, లింగంపల్లి నర్సయ్య, భూమన్న, బాలయ్య, మహేష్ పాల్గొన్నారు.

రుద్రంగి: ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నాక రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అభివృద్ధి కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటెయ్యాలని రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు. మండల కేంద్రంలో నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. సెస్ డైరెక్టర్ గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: నిజామాబాద్, నిమ్మపల్లి, ఎగ్లాస్‌పూర్, మామిడిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు.

రాష్ట్ర ప్రజాశిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఒగ్గు ప్రబాకర్, నాయకులు మిర్యాల్‌కార్ హరీష్, జవ్వాజి అరవింద్, ఊరడి అరవింద్ బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుద్దాల గ్రామానికి చెందిన జేఏసీ నాయకుడు ఉప్పుల ఆంజనేయులు, తదితరులు బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు సమక్షంలో చేరారు.



భూషణరావుపేటలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న చల్మెడ లక్ష్మీ నరసింహారావు

వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన శాత్రాజుపల్లిలో ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు గుడిసె మనోజ్, నల్ల సతీష్‌రెడ్డి, అనిల్, పురుషోత్తం , నరేష్, మధు, వెంకటేశం, అనిల్, రాజు, ప్రకాశ్, మహేందర్, గణేశ్ పాల్గొన్నారు.

కథలాపూర్: బీఆర్‌ఎస్ మూడోసారి అధికారంలోకి రాగానే ఎత్తిపోతలతో మండలానికి సాగునీరందించి సస్యశ్యామలం చేస్తామని వేములవాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు మండలంలోని పోసానిపేట, సిరికొండ, భూషణరావుపేట, ఊట్‌పెల్లి, పెగ్గెర్ల, చింతకుంట గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, నియోజకవర్గ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ భూమయ్య, పార్టీ మండలాధ్యక్షుడు గంగప్రసాద్, మాజీ ఎంపీపీ భువనేశ్వరి, ఎంపీటీసీలు ఆంజనేయులు, మల్యాల రమేశ్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశానికి తరలివెళ్లిన నాయకులు

ధర్మపురి: మాదిగల హక్కుల సాధన కోసం హైదరా బాద్‌లో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ సమావేశానికి ధర్మపురి నుంచి నాయకులు శనివారం తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన సమావేశానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరయ్యారు.ధర్మపురితో పాటు పలు మండలాల నుంచి నాయకులు తరలివెళ్లారు. సతీశ్, శ్రీనివాస్, రవికుమార్, ప్రేమిత్ కుమార్ తదితరులున్నారు.